

స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 13: ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతుంది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రోడ్డు రవాణా శాఖ, బీసీ వెల్ఫేర్ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో బంద్ ప్రశాంతం

- మద్దతు తెలిపిన ఆయా పార్టీల నాయకులు
- స్వచ్ఛందంగా వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థల మూసివేత

సిద్దిపేట క్రైం/గజ్వేల్/ములుగు, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై దాడికి నిరసనగా హిందూ ఐక్యవేదిక నాయకులు సిద్దిపేట బంద్‌కు పిలుపునిచ్చారు. హిందూ ఐక్యవేదిక నాయకుల పిలుపుమేరకు పట్టణంలో వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పట్టణంలో ప్రధాన వీధుల గుండా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కొందరు వ్యాపారులు బంద్ పాటించకపోవడంతో హిందూ ఐక్యవేదిక నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు ఇరువర్గాలను శాంతిపంజేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు నిర్వహించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. హైందవ సంఘాల నాయకులు పిలుపునిచ్చిన ఈ బంద్‌కు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సంఘీభావం ప్రకటించగా, స్కూళ్లు మూతబడ్డాయి. వ్యాపార, వర్తక సంస్థల యజమానులు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించారు. అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు భారీ ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీకి బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ మాజీచైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ నాయకులు వెంకటరమణ, గురువారెడ్డి, మనోహర్‌యాదవ్ తదితరులు మద్దతు పలికారు. పిడిచెడ్ రోడ్డు చౌరస్తాలో నిరసన తెలిపిన అనంతరం పలువురు హైందవ సంఘాల నాయకులు గజ్వేల్ ఆర్డీవోకు వినతీపత్రాన్ని అందజేశారు. ములుగు, వంటిమామిడిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బీజేపీ నాయకులు లక్ష్మణ్ గౌడ్, చిరంజీవి యాదవ్, బాగ్యలక్ష్మి కృష్ణయాదవ్‌తో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


సిద్దిపేట పట్టణంలో బంద్‌కు సహకరించని వ్యాపారులతో వాగ్వాదాన్ని దిగుతున్న హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు




గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న హైందవ సంఘాల నాయకులు

మల్లన్నసాగర్‌లోకి గోదావరి జలాలు

- కొనసాగుతున్న ఎత్తిపోతలు
- ప్రస్తుతం రిజర్వాయర్‌లో 9.75 టీఎంసీల నీటి నిల్వ
- ఈనెల 18 వరకు మూడు పంపులతో పంపింగ్

తొగుట, ఆగస్టు 13 : మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఈనెల 18 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. యాసంగి పంటకు రైతులకు నీరందించేందుకు రిజర్వాయర్‌లో 12.5 టీఎంసీల నీటి నిల్వ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి వచ్చే వరదను మిడ్‌మానేరు మీదుగా అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయకసాగర్ ద్వారా 50 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్‌లోకి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ఈ నెల 8న ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. అంతకు ముందు రిజర్వాయర్‌లో 8.55 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఐదు రోజులుగా నాలుగు పంపుల ద్వారా పంపింగ్ చేసిన అధికారులు 2.25 టీఎంసీ నీటిని ఎత్తిపోసి మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి 1 టీఎంసీ నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 9.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రైతుల యాసంగి పంటలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 18 వరకు నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో మంగళవారం మూడు పంపుల ద్వారా ప్రతిరోజు 3,900 క్యూసెక్కుల నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు. మొత్తంగా ఐదు రోజుల పాటు రిజర్వాయర్‌లో 12.5 టీఎంసీల నీరు నిల్వచేసి అందులోంచి రెండు టీఎంసీల నీటిని కొండపోచమ్మ రిజర్వాయర్‌కు తరలించేలా చర్యలు తీసుకుంటామని మల్లన్నసాగర్ డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద వరద ఉధృతి కొనసాగితే రెండో దఫా మల్లన్నసాగర్‌లోకి గోదావరి నీటి ఎత్తిపోతలను ప్రారంభిస్తామని తెలిపారు. మల్లన్నసాగర్‌లో నీటి నిల్వ చేయడం వల్ల దుబ్బాక ప్రధాన కాలువ మెయిన్ కెనాల్ ద్వారా దుబ్బాక, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని 95 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను నింపి లక్షా 25వేల ఎకరాలకు సాగు నీరందించడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.


రంగనాయకసాగర్ నుంచి మల్లన్నసాగర్ పంప్‌హౌజ్‌లోకి చేరుకుంటున్న గోదావరి జలాలు

నార్కోటిక్ డ్రగ్స్ కిట్ల పంపిణీ

- సిద్దిపేటను డ్రగ్స్‌రహిత జిల్లాగా మార్చాలి : సీపీ


పోలీసులకు నార్కోటిక్ డ్రగ్స్ కిట్లను అందజేస్తున్న సీపీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 13 : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులకు 100 నార్కోటిక్ డ్రగ్స్ కిట్లను మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేసే సమయంలో అనుమానం ఉన్న వ్యక్తులను నార్కోటిక్ డ్రగ్ కిట్స్ ద్వారా పరిశీలించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పోర్ట్స్ ఏరియాల్లో తనిఖీలు నిర్వహించినప్పుడు తప్పకుండా వీటిని ఉపయోగించాలని ఆమె సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే ప్రధాన లక్ష్యమని, మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని తెలిపారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు సేవించేవారు వారి మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. యువత తల్లిదండ్రులు, గురువుల మాట వినాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎస్ మల్లారెడ్డి, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐ చంద్రం, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

72 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

జిల్లాలో సోమవారం రాత్రి 7 నుంచి 9 వరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 72 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, నంబరు ప్లేట్ లేని 62 వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు.


అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో స్కావెంజర్ల విధులు

- విద్యార్థుల సంఖ్యను బట్టి వేతనాలు

మద్దూరు, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చేందుకు సర్కారు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. విద్యార్థుల సంఖ్యానుగుణంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రతీ పాఠశాలకు పూర్తి బాధ్యతతో నిర్వహణ చేపట్టే విధంగా ప్రభుత్వం స్కావెంజర్ పోస్టులకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా 636, ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత, 14 ఆదర్శ, 23 కస్తూర్బా పాఠశాలలున్నాయి. మద్దూరు మండలంలో 10 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా, మోడల్‌స్కూల్ ఉన్నాయి. ఇందులో మొత్తం 2వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

వేతనం ఖరారు..

పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్స్‌కు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వేతనాల్ని కేటాయించింది. 1-30 మందికి రూ.3వేలు, 31-100 మందికి రూ.6వేలు, 101-350 మందికి రూ.8వేలు, 251-500 మందికి రూ.12 వేలు, 501-750 మందికి రూ.15 వేలు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులున్నా పాఠశాలలకు రూ.20 వేలు ఇచ్చే విధంగా సర్క్యూలర్ జారీ చేశారు. పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల క్లీనింగ్, పాఠశాల పరిశుభ్రతతో పాటు మొక్కల సంరక్షణ చేపట్టే విధంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాల మెంటెనెన్స్ గ్రాంట్‌తో పాటు అమ్మఆదర్శ పాఠశాల కమిటీలకు నేరుగా వీరికి 10 నెలల పాటు అందించే గ్రాంట్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి బాధ్యతలు అమ్మ ఆదర్శ కమిటీలు చూసుకోవాల్సి ఉంటుంది.



కోమటిచెరువుకు కొబ్బరిహారం



సిద్దిపేట జిల్లా కోమటిచెరువు నెక్లెస్‌రోడ్డు మార్గంలో మూడేళ్ల క్రితం నాటిన కొబ్బరి మొక్కలు నేడు వృక్షాలై దారి ఇరువైపులా పచ్చని హారంలా కనిపిస్తున్నాయి.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నేనంటే నేను..!

- జిల్లాలో ఇద్దరు ఇంటర్ విద్యాధికారులు
- ఒకరికి డైరెక్టర్.. ఇంకొకరికి కోర్టు ఉత్తర్వులు
- ఇద్దరి నడుమ 'కుర్చీ' పంచాయితీ
- జూనియర్ కాలేజీల్లోనూ వేర్వేరుగా తనిఖీలు
- తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు
- ఇంతకూ జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎవరో?

ఈనెల 12 సోమవారం రోజున జిల్లా ఇంటర్ విద్యాధికారి హోదాలో రవీందర్‌రెడ్డి సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అక్కడి ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు.

13 మంగళవారం రోజున జిల్లా ఇంటర్ విద్యాధికారి హోదాలోనే హిమబిందు దుబ్బాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్షించారు.'

హోదా ఒక్కటే.. కానీ అధికారులు ఇద్దరు. ఈ విచిత్రమైన పరిస్థితి సిద్దిపేట జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. (డీఐఈవో) జిల్లా ఇంటర్ విద్యాధికారి హోదాలో ఎవరికి వారు తనిఖీలు చేస్తుండడంతో కళాశాలల ప్రిన్సిపాళ్లు తలలు పట్టుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు 8

సవాల్‌గా 'డీఐఈవో కుర్చీ'

సిద్దిపేట జిల్లా ఇంటర్ విద్యాధికారిగా పనిచేసిన సూర్యప్రకాశ్‌రావు జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు. అప్పుడు జిల్లాలోని బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న హిమబిందును సీనియర్‌గా భావించి జూలై 1న డీఐఈవోగా ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ప్రిన్సిపాళ్ల బదిలీలు జరిగాయి. హిమబిందు బెజ్జంకి నుంచి సిద్దిపేట బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. అప్పటి వరకు డీఐఈవోగా ఆమెనే కొనసాగారు. కరీంనగర్ నుండి కోహెడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చిన రవీందర్‌రెడ్డి సీనియారిటీ జాబితాలో ముందున్నారని ఆయనకు డీఐఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు కల్పిస్తూ ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 6న ఉత్తర్వులు రాగా 8న ఆయన డీఐఈవోగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ ఉత్తర్వులను సవరించాలని అప్పటిదాకా ఇన్‌చార్జి డీఐఈవోగా కొనసాగుతున్న హిమబిందు కోర్టును ఆశ్రయించారు. తననే డీఐఈవోగా కొనసాగించాలని విన్నవించడంతో కోర్టు నుంచి ఆమెకు 'స్టేటస్ కో' ఉత్తర్వులు వచ్చాయి.

ఇటు ఆఫీసుకు.. అటు తనిఖీలకు

ఇంటర్మీడియట్ డైరెక్టర్ ఉత్తర్వుల ఆధారంగా రవీందర్‌రెడ్డి, కోర్టు ఉత్తర్వులతో హిమబిందు ఎవరికి వారే డీఐఈవోగా కొనసాగడం ఆ రంగంలోని వారికి సంకట పరిస్థితిని తెచ్చిపెడుతోంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించానని ఇటు రవీందర్‌రెడ్డి.. జూలై నుంచి ఇలాగే కొనసాగుతున్నానని హిమబిందు ఇద్దరూ అదే హోదాతో పిలిపించుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రవీందర్‌రెడ్డి డీఐఈవో కార్యాలయంలోని కుర్చీలో కూర్చుంటుండగా.. హిమబిందు అదే కార్యాలయంలోని మరో కుర్చీలో ఎదురుగా కూర్చుంటున్నట్లు తెలిసింది. ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలల తనిఖీల సందర్భాల్లోనూ ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సైతం మిన్నకుండిపోతున్నారు. ఇద్దరికీ వేర్వేరు ఉత్తర్వులు ఉండడం.. వాటిపై ఇంటర్ విద్యకు సంబంధించిన ఉన్నతాధికారులు సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో వారు కూడా తనిఖీలకు సహకరిస్తున్నారు.





సిద్దిపేటలోని బాలుర కళాశాలలో డీఐఈవో హోదాలో తనిఖీ చేస్తున్న రవీందర్‌రెడ్డి


దుబ్బాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో హోదాలో రికార్డులను పరిశీలిస్తున్న హిమబిందు

తుది నిర్ణయం ఎవరి వైపో?


రవీందర్‌రెడ్డికి విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు


హిమబిందుకు అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులు

హిమబిందు కోర్టును ఆశ్రయించడంతో సదరు స్టేటస్ కో ఉత్తర్వులను ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇంటర్మీడియట్ డైరెక్టర్‌తో పాటు రవీందర్‌రెడ్డికి చేరవేశారు. దీనిపై నేడు తుది తీర్పు వెలువడనున్న ది. తాను స్థానికంగా ఉన్న కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నానని, డీఐఈవోగా పనిచేసిన అనుభవం ఉందని, తనకే అనుకూల తీర్పు వస్తుందనే ధీమాతో హిమబిందు ఉన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని 14 జిల్లాలకు సీనియర్ ప్రిన్సిపాళ్లను డీఐఈవో ఇన్‌చార్జులుగా నియమిస్తూ ఇంటర్ విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు, సీనియారిటీ దృష్ట్యా తానే కొనసాగుతానని రవీందర్‌రెడ్డి భరోసా వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం గురించి ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. ఈ ఇద్దరి కుర్చీ పంచాయితీకి ఎలాంటి ముగింపు పలుకుతారో వేచిచూడాలి.



మెదక్ ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు

దేశ సమగ్రతను కాపాడే బాధ్యత అందరిది

- హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 13: దేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో ఆయన కళాశాల విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 సందర్భంగా ప్రతీ భారతీయుడు తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగరవేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహాత్ములను స్మరించుకోవాలని కోరారు. దేశ కోసం ప్రాణాలను అర్పించిన సుభాష్ చంద్రబోస్, శివాజీ వంటి మహనీయులను మననం చేసుకునేందుకే ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టిన్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశంలోని యువశక్తికి ప్రపంచాన్ని శాసించే సత్తా ఉందని పేర్కొన్నారు. భారతదేశ ప్రజలు పరమత సహనంలో ప్రపంచానికే ఆదర్శంగా ఉన్నారని, అందుకే దేశంలో మైనారిటీలు సుభిక్షంగా ఉంటున్నారని పేర్కొన్నారు. కానీ కొందరు మీడియా, సోషల్ మీడియాలో దేశంలో ఏదో జరుగుతున్నట్టు పోస్టులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బంగ్లాదేశ్‌లో హిందువుల హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, శ్రీనివాస్, నందారెడ్డి, రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, వివిధ మోర్చాల అధ్యక్షులు కాశీనాథ్, వీణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లో 'ఏసీబీ' తనిఖీలు

- రిజిస్టర్ల నిర్వహణపై అసంతృప్తి
- విద్యార్థుల హాజరులో అవకతవకలు
- ఉన్నతాధికారులకు నివేదిక

సిద్దిపేట క్రైం, ఆగస్టు 13 : సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ మాట్లాడారు. డీజీపీ ఆదేశాల మేరకు సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు, తూనికలు కొలతల అధికారులు, శానిటరీ, ఆడిట్ అధికారులు పాల్గొనట్లు ఆయన వివరించారు. వసతి గృహ నిర్వాహకులు 12 రకాల రిజిస్టర్లు నిర్వహించడం లేదని తాము ఈ తనిఖీల్లో గుర్తించినట్లు చెప్పారు. హాస్టల్ సందర్శనకు ఎవరైనా వస్తే వారి పేర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు వస్తే వారి పేర్లను కూడా సమయంతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కానీ ఈ హాస్టల్‌లో అలాంటివి ఏవి కూడా నమోదు చేయలేదన్నారు. ప్రతిరోజూ హాస్టల్ విద్యార్థుల అటెండెన్స్ తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ హాస్టల్‌లో హాజరు కాని విద్యార్థుల రిజిస్టర్ పట్టికలో ఆబ్సెంట్ అని పెట్టకుండా 'డాట్' అని పెట్టడాన్ని కూడా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా జూన్, జూలైలో అబ్‌స్ట్రాక్ట్ నిర్వహణ లేదన్నారు. తాము గుర్తించిన విషయాలను పై అధికారులకు రిపోర్ట్ చేస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.


హాస్టల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి


సిద్దిపేట బీసీ బాలుర హాస్టల్‌లో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అధికారులు

అమ్మిన ఎరువు బస్తాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలి

చిన్నశంకరంపేట, ఆగస్టు 13: రైతులు కొనుగోలు చేసిన ప్రతీ ఎరువు బస్తాను ఆన్‌లైన్లో పేర్లను నమోదు చేయాలని మెదక్ ఏడీఏ విజయనిర్మల సొసైటీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లి గ్రామాల్లోని ఆగ్రోస్ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం చిన్నశంకరంపేట సొసైటీ గోదాంలలో ఎరువు బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సొసైటీలో ఎరువు బస్తాలను ఆన్‌లైన్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. మొబైల్ యాప్‌పై సొసైటీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలు: పాండురంగారెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 13: అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఒకేచోట ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల నిర్మాణం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ రాధతో కలిసి మున్సిపల్ పాలకమండలి ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. గతంలో మున్సిపల్ కార్యాలయం, సమీకృతకూరగాయల మార్కెట్, మినీస్టేడియం నిర్మాణానికి స్థలాలను కేటాయించారన్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలకు, పోలీసు స్టేషన్‌కు సైతం పక్కనే కేటాయిస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

మెదక్ జిల్లా పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక

మెదక్ కల్చరల్, ఆగస్టు 13: మెదక్ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం చర్చి ఆవరణలో ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా వినయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా జీవరత్నం, జనరల్ సెక్రటరీగా నెల్సన్, జాయింట్ సెక్రటరీగా హెంద్రిపాల్, ట్రెజరర్‌గా ఏసుబాబును ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల నిర్వహణ గంట సంపత్, ప్రభాకర్, పార్థసారధి, లాజర్, ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం నూతన కమిటీలోని నూతన పాస్టర్‌లను ఘనంగా సన్మానించారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జహీరాబాద్, ఆగస్టు 13: పంటసాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్తలు రాహుల్‌విశ్వకర్మ, సరిత పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో వారు పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సోయాపంట సాగుసమయంలో అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను రైతులు పొందాలన్నారు. రంజోల్ గ్రామంలో ఓ రైతు సాగుచేస్తున్న అదిలాబాద్ సోయాబీన్ 15రకం పంటను పరిశీలించారు. మిగతారకాలతో పోల్చుకుంటే ఈరకం పంట త్వరితగతిన కోతకు వస్తుందని, గింజ పరిమాణం నాణ్యతగా ఉంటుందన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ

కొండాపూర్, ఆగస్టు 13: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామ శివారులో మంగళవారం ఇన్నోవా, ట్రాక్టర్ ఢీకొనడంతో ట్రాక్టర్ ఇంజన్ రెండు భాగాలుగా విడిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం... మునిదేవునిపల్లి నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ రోడ్డుపై ట్రాక్టర్ వెళ్తుంది. ట్రాక్టర్ డ్రైవర్ విఠల్ పొలాల వద్దకు వెళ్లేందుకు ఎడమవైపు స్టీరింగ్ తిప్పాడు. అదే సమయంలో వెనకనుంచి వస్తున్న (ఎల్ఎన్‌టీ సంస్థ) ఇన్నోవా కారు అతివేగంగా ఎడమ వైపు నుంచి వచ్చి ట్రాక్టర్ ఇంజన్ మధ్య ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ రెండుగా విడిపోయి, విఠల్‌కు స్వల్ప గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



కిష్టారెడ్డి(ఫైల్)

తొగుట, ఆగస్టు 13: అప్పులబాధతో వ్యక్తి సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన తూంకుట్ల కిష్టారెడ్డి(45) సిద్దిపేటలో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం గ్రామంలో పంట చిట్టీ ఉన్నదని గ్రామానికి వచ్చాడు. చిట్టీ కట్టేందుకు డబ్బులు లేకపోవడం, అప్పులవారి వేధింపులు తాళలేక ఇంట్లోని గడ్డి మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిట్టీ సమయం మించిపోతున్నా కిష్టారెడ్డి ఇంకా రాలేదని గ్రహించిన అతడి బంధువు ఇంటికి వచ్చి చూసేసరికి అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు ములుగు ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య రమ, కొడుకు విష్ణువర్ధన్‌రెడ్డి, కూతురు భానుతేజ ఉన్నారు. మృతుడి కొడుకు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు తెలిపారు.

క్విట్ ఇండియా ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

● ప్రొఫెసర్ కోదండరాం



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

నర్సాపూర్, ఆగస్టు 13: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలందరిలో జాతీయ భావం తీసుకువచ్చి, వారు శాంతియుతంగా ఉద్యమం చేసి బ్రిటీష్ వారు వెళ్లిపోయేలా చేసిన క్విట్ ఇండియా ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం క్విట్ ఇండియా జాతీయ ఉద్యమంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ దామోదర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ 1942లో మొదలైన క్విట్ ఇండియా ఉద్యమం దేశవ్యాప్తంగా శాంతియుతంగా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలలో కూడా చైతన్యం తీసుకువచ్చిందన్నారు. నేటి తరం కూడా చరిత్ర కూడా తెలుసుకోవాలని అది తెలిస్తేనే వర్తమానంలో రాణిస్తామన్నారు. చరిత్రనే వర్తమానాన్ని శాసిస్తుందన్నారు. అయితే నేడు వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మారిన కాలానుగుణంగా చరిత్ర తెలుసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని తద్వారా సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తదితరులు మాట్లాడుతూ నేటి యువతరానికి చరిత్ర తెలుసేలా కృషి విజ్ఞాన సంస్థ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన సంస్థ అధ్యక్షులు లక్ష్మీకాంతరావు, మాజీ ఎస్పీ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సుదర్శన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి,మణిదీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. సెమినార్ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా అందులో ప్రతిభ చూపిన వారికి సంస్థ తరుపున సత్కరించి చరిత్రకు సంబంధించిన పుస్తకాలను బహుకరించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి



సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

జగదేవ్‌పూర్, ఆగస్టు 13: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని పీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాత పంటల సాగు, జీవవైవిధ్య పంటల సాగుపై మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇష్టమైన రంగంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించి, వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునందిస్తున్నదని చెప్పారు. హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టుగా 100 మంది మహిళలకు ఈ ఆటో కార్యక్రమం ద్వారా ఎనిమిది వారాల పాటు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్ శిక్షణ అందించి, వారికి త్వరలోనే ఎలక్ట్రిక్ ఆటోలు సైతం అందించనున్నట్లు తెలిపారు. జగదేవ్‌పూర్ ప్రాంతంలో త్వరలోనే ఈ ఆటో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, అరుణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కవితారెడ్డి, అమర రాము, పీస్ సిబ్బంది మహేష్, పద్మ, వెంకట్‌లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారిని శోభారాణి దర్శించుకున్నారు.

నేటి నుంచి నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాలు

● 14 నుంచి 17 వరకు ఉత్సవాలు..

● తరలిరానున్న వందలాది మంది భక్తులు



పవిత్రోత్సవాల సందర్భంగా ముస్తాబైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం

వర్గల్, ఆగస్టు 13: సిద్దిపేట జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో 14 నుంచి 17వ తేదీవరకు స్వామివారి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. క్షేత్రంలో నాలుగురోజుల పాటు జరిగే వేడుకలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలను అలంకరింపజేశారు. 14న సాయంత్రం ఆలయంలో 6.30 గంటలకు పవిత్రోత్సవాలకు అంకురార్పణ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 15న ఉదయం 8.30 గంటలకు ఆలయ యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, మూర్తి కుంభస్థాపన, పవిత్ర అధివాసం, పవిత్రారోపణము, సాయంత్రం 5 గంటలకు మూలమంత్ర హోమం, ద్రావిడ ప్రబంధ పారాయణములు నిర్వహిస్తారు. 16న ఉదయం మూలమంత్ర హవనం, ద్రావిడ ప్రబంధపారాయణము, 17న ఉదయం మహా పూర్ణాహుతి, పవిత్ర అవరోపనము, మూరికుంభప్రోక్షణ, ద్రావిడ ప్రబంధ పారాయణములు నిర్వహిస్తారు. వేడుకలకు భక్తులు వందల సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులు రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి బైక్‌లు చోరీ

● నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలను వెల్లడిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చేగుంట, ఆగస్టు 13: జల్సాలకు అలవాటుపడి పార్క్ చేసిన బైక్‌లను చోరీచేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున రహదారిపై ఎస్ఐ బాలరాజ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనఖీ చేస్తున్న క్రమంలో మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోతి జనార్ధన్ బైక్‌పై వెళ్తున్నాడు. అతడిని ఆపుతున్న సమయంలో బైక్‌ను వదిలి వెళ్లడానికి ప్రయత్నించాడు. పట్టుకుని విచారించగా.. బైక్‌లను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతని స్నేహితులు రేపల్లి లక్ష్మణ్, చింతల జగన్ కూడా ఏ పని చేయకుండా పార్కింగ్ చేసిన వాహనాలను చోరీచేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపాడు. ఒక సంవత్సరంలో చేగుంట, తూప్రాన్, మెదక్, మేడ్చల్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసి, పరిచయం ఉన్న సిర్నాపల్లికి చెందిన వడ్ల శ్రీకాంత్‌కు అమ్మి వచ్చిన డబ్బులు జల్సాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. జనార్ధన్ ఇంటి సమీపంలోని చెట్ల పొదల్లో దాచి ఉంచిన 15 బైక్‌లను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన నాయకులు

మాసాయిపేట, ఆగస్టు 13: మాసాయిపేటలోని చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద నిర్మిస్తున్న 23 రైల్వే గేట్ అండర్ బ్రిడ్జి పనులను మంగళవారం కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరిశీలించారు. జాతీయ రహదారిపై ఉన్న ఈ రైల్వే గేటు వద్ద 2003లో జరిగిన స్కూల్ బస్సు ప్రమాదంలో 23 మంది చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. నాటి నుంచి పలు గ్రామాల ప్రజల డిమాండ్ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి పనులు చేపట్టారు. పదిహేను రోజుల క్రితం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైతం పార్లమెంట్‌లో ఇక్కడ ఆర్‌యూబీ ఆవశ్యకతను వివరంచారు. ఈ నేపథ్యంలో ఇక్కడ పనులు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు కిష్టారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, జగదీష్, నాగేందర్‌రెడ్డి, పాపన్నగారివేణు, నవీన్ యాదవ్ తదితరులు సందర్శించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

● గతనెల 31న ఘటన.. మరుసటి రోజు ఖననం

● యువకుడి వేధింపుల వల్లేనని ఫిర్యాదు

● 13 రోజుల తర్వాత పోస్టుమార్టం



గోస్కె సుప్రజ (ఫైల్)

టేక్మాల్, ఆగస్టు 13: ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి మృతదేహాన్ని 12 రోజుల తర్వాత వెలికి తీసి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. అయితే, విద్యార్థిని గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరిట వేధించడం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందన్న ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం పూడ్చి పెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం చేయించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం తంపులూరు గ్రామానికి చెందిన గోస్కె సుప్రజ(16) హవేళిఘనపురంలో ఉంటూ ఇంటర్ చదువుతోంది. గతనెల 30న ఇంటికి వచ్చింది. మరుసటి రోజు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకుంది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకుండానే కుటుంబసభ్యులు ఈనెల 1న తమ సొంత పొలంలోనే ఖననం చేశారు. అయితే, గ్రామానికి చెందిన ఓ యువకుడు తన కోడలిని ప్రేమపేరుతో మానసికంగా, శారీరకంగా వేధించడంతోనే ఆత్మహత్య చేసుకుందని అనుమానిస్తూ బాలిక మామయ్య గోస్కె సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక మృతదేహాన్ని వెలికితీసి సంగారెడ్డికి చెందిన ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ పి. వాణిశ్రీ, డాక్టర్ చంద్రదీక్‌ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. టేక్మాల్ తహసీల్దార్ కృష్ణ, అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ ఏఎస్ఐ తుక్కయ్యలు పోస్టుమార్టంను పర్యవేక్షించారు.

రోడ్డే ఆటస్థలం



సర్వీస్ రోడ్డుపై ఆటలాడుతున్న విద్యార్థులు

కోహీర్, ఆగస్టు 13: స్కూళ్లంటే ఆటస్థలాలు ఉండాలి. గురుకులాలంటే అన్ని సౌకర్యాలూ ఉంటేనే విద్యార్థులు సంపూర్ణంగా చదువుతో పాటు ఆటలూ నేర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, ఆ గురుకుల విద్యార్థులకు రోడ్డే ఆట స్థలంగా మారింది. కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని 65వ జాతీయ రహదారి పక్కనే మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఉంది. అద్దె భవనంలో నడుస్తున్న ఈ గురుకులంలో సుమారు 450 మంది విద్యార్థులు ఉండగా, వారికి ఆట స్థలం లేదు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని భావించగా, మైదానం లేకపోవడంతో ఉపాధ్యాయులు జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డును మైదానంగా మార్చేశారు. అక్కడే వారికి పలు ఆటల్లో పోటీలు నిర్వహించారు.

సహకార సంఘాన్ని సందర్శించిన ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం



ప్రాథమిక సహకార సంఘం వద్ద ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం

బెజ్జంకి, ఆగస్టు 13: బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మంగళవారం 9 ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, సీఈవో ఎన్.సత్యనారాయణరావును సహకారం సంఘం పనితీరును అడిగి తెలుసుకున్నారు. సొసైటీ ద్వారా జరిగే లావాదేవీలు, ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయ రుణాలు, పెట్రోల్ బంక్, ఫంక్షన్‌హాల్ నిర్వహణ, గోల్డ్ లోన్స్, హౌసింగ్ లోన్స్ నిర్వహణపై ప్రతినిధుల బృందానికి చైర్మన్ శరత్‌రావు వివరించారు. తమ రాష్ట్రాల్లో కూడా సహకార సంఘం ద్వారా సేవలందించేందుకు ఎంతో నేర్చుకున్నామని ప్రతినిధుల బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, సొసైటీ సీఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆహ్వానం

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 13: సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2024 విద్యాసంవత్సరానికిగానూ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆగస్టు 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులకు 15 ఏళ్ల సర్వీసు, వర్కింగ్ టీచర్స్‌కు 10 ఏళ్ల సర్వీసు ఉండాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు మండల విద్యాధికారికి, హైస్కూల్ ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నేరుగా జిల్లా విద్యాశాఖాధికారికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

బీటీ రోడ్డు, గోదావరి జలాలను అందించాలి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్‌ఎస్వీ నాయకుల వినతి

చేర్యాల, ఆగస్టు 13: చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామం నుంచి పెద్దరాజుపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో పల్లాను కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. గ్రామం నుంచి పెద్దరాజుపేట వరకు మట్టిరోడ్డు ఉండటంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బీటీరోడ్డు చేపట్టి రవాణా సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. అలాగే తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గ్రామంలోని మాధవరెడ్డి డ్యాం, బయ్యన్న చెరువును గోదావరి జలాలతో నింపాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రం, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, కనకయ్య, బాల్‌రెడ్డి, కుమార్, నరేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెలే రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జింకల పర్వతాలుయాదవ్

సమాచారం

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌ఐ

ములుగు, ఆగస్టు 13: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు గంజాయి, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని ములుగు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి వంటిమామిడిలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారనేది గమనిస్తూ ఉండాలని సూచించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్‌కార్డ్, బ్యాంకు నంబర్లు తెలపాలని కోరితే చెప్పొద్దన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ

నంగునూరు, ఆగస్టు 13: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రాజగోపాలపేట ఎస్‌ఐ ఆసిఫ్ అన్నారు. మంగళవారం నంగునూరు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించడానికే తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రిన్సిపల్ కిషన్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయ దండోరాకు ఎమ్మార్పీఎస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 1: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన విజయ దండోరా ర్యాలీకి హుస్నాబాద్ నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ సాధించి విజయంగా హైదరాబాద్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి తరలివెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తుల చంద్రమౌళి, బొజ్జ హరీశ్, ఎలగందుల లక్ష్మీనారాయణ, గాదపాక రవీందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 13: సిద్దిపేట ప్రాజెక్ట్ అంబేడ్కర్ నగర్ సెక్టార్ కేసీఆర్ నగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో 20 ఏళ్లుగా ఆయాగా విధులు నిర్వర్తిస్తున్న జ్యోతి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. కాగా దహన సంస్కారాలకు డిపార్ట్‌మెంట్ తరఫున రూ.10 వేలను అందజేశామని ఏసీడీపీవో ఛాయాదేవి, సూపర్‌వైజర్ వసంత తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, జయశ్రీ, పుష్ప, రమ, రత్న, పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి వరం

గజ్వేల్, ఆగస్టు 13: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ గజ్వేల్ నాయకుడు కళ్యాణ్‌కర్ నర్సింగరావు అన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన పలువురికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు.

'స్టోన్ క్రషర్ పనులను నిలిపి వేయాలి'

జిన్నారం, ఆగస్టు 13: రాళ్లకత్వలో ఏర్పాటు చేస్తున్న నూతన స్టోన్ క్రషర్ పనులు నిలిపి వేయాలని స్థానికులు ఆందోళన చేశారు. మంగళవారం రాళ్లకత్వ శివారు 286 సర్వే నెంబరులోని అసైన్డ్ భూమిలో కొందరు మైనింగ్‌శాఖ అనుమతులతో స్టోన్ క్రషర్ పనులు చేపట్టారని, అక్కడ గ్రామ ప్రధాన చెరువుకు వర్షపు నీటిని తరలించే వెండికుంట, చెక్ డ్యాం భూములు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళనకు పూనుకున్నారు. అసైన్డ్ భూములు, కాలువలను ఆక్రమించే ప్రయత్నాలను అడ్డుకొని, క్రషర్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో గ్రామస్థులు, యువకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం

వర్గల్, ఆగస్టు 13: ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరింపజేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో వర్గల్ మండలంలోని చౌదర్‌పల్లి, నగరంతండా, అవుసులోనిపల్లి, గౌరారం, నెంటూర్ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌శర్మ మాట్లాడుతూ జీవో 11, 12లను సవరింపజేస్తామని, 5,600 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయిస్తామని, పీఎస్ హెచ్‌ఎంలు పదివేలకు పెంచడంతో పాటు డీఎడ్, బీఎడ్ అర్హత కలిగిన వారికి పదోన్నతులు ఇప్పిస్తామన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా చేస్తామన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలో పాత పెన్షన్ వర్తింపజేసే జీవోను ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చందర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, బండ నరసింహారెడ్డి, వంటేరు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శశిధర్‌శర్మ

మొక్కజొన్న, తృణధాన్యాలు సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జగదేవ్‌పూర్, ఆగస్టు 13: మొక్కజొన్న, తృణధాన్యాల పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ భద్రు, డాక్టర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని తిగుల్ రైతువేదికలో రైతులకు 'మొక్కజొన్న, తృణధాన్యాలు పంటల్లో చీడపీడల యాజమాన్యం, వివిధ పంటల్లో పురుగు మందు అవశేషాలు' అనే అంశం మీద హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శరణ్య, సమత, ఖలీల్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు

వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 13: ముదిరాజ్‌లు ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని అనంతరామన్ కమిషన్ గతంలోని చెప్పిందని, కమిషన్ సూచనల మేరకు ముదిరాజ్ కులస్థులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం సిద్దిపేట నాయకులు శ్రీనివాస్, ధర్మ, శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేటలో ప్రెస్‌క్లబ్‌లో వారు సమావేశమై ముదిరాజ్ కులస్థుల హక్కులపై చర్చించారు. బీసీ-డీ కేటగిరీలోని కొన్ని కులాలు తమను బీసీ-ఏ కేటగిరీలోకి చేరనీయకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ జీవో ద్వారా ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చారని, తర్వాత కోర్టు కేసుల వల్ల అది సాధ్యపడలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యాదగిరి, సతీష్, కిష్టాపూర్ లక్ష్మణ్, శ్రావణ్, శ్రీశైలం, చింటూ, ప్రశాంత్, ముదిరాజు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నముదిరాజ్ సంఘం నేతలు

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చితే 57 కులాలకు అన్యాయం

● బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరహరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 13: ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చితే ఇప్పుడు బీసీ-ఏలో 57 కులాల్లో ఉన్న తమకు అన్యాయం జరుగుతుందని బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల నరసింహులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15,16 ప్రకారం వెనుకబడిన తరగతులను నిర్ధారించే విధాన రూపకల్పన జరిగిందన్నారు. దీని ప్రకారం పేదరికం, విద్యా ప్రమాణాలు, నివాస పరిస్థితులు, ప్రాంతం, వృత్తి ఉద్యోగ ప్రామాణికత, రాజకీయ ప్రాతినిధ్యం, సాంఘిక పరిస్థితుల ఆధారంగా కులాలను గ్రూపులలో చేర్చారన్నారు. ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చడం వల్ల బీసీ-ఏ గ్రూపులో ఉన్న అర్థసంచార, సంచార జాతులు, విముక్త జాతులు, ఆదిమ జాతుల ప్రజల బతుకులు ఆగమైతాయన్నారు. అనంతరం జిల్లా బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా స్వామి, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా కనకయ్య ఎన్నికయ్యారు. నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాదనరేందర్ పాల్గొన్నారు.

సమావేశంలో స్వల్ప వాగ్వాదం

సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి జిల్లాస్థాయి సదస్సు నిర్వహించగా.. అంతకుముందే సమావేశం నిర్వహించిన సిద్దిపేట ముదిరాజ్ కులస్థులు.. అక్కడికి వచ్చి మాకు పోటీగా ఎందుకు సమావేశం నిర్వహిస్తారని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ-ఏ కులా పరిరక్షణ సమితి సమావేశం ఫ్లెక్సీని చించేశారు. ఈ విషయమై బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు ముదిరాజ్ కులస్థులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

తపాలా సేవలను వినియోగించుకోవాలి: మదన్‌మోహన్

ధూళిమిట్ట, ఆగస్టు 13: మండలంలోని కూటిగల్ గ్రామ పోస్టాఫీసులో మంగళవారం తపాలాశాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అసిస్టెంట్ సూపరింటెండెంట్ మదన్‌మోహన్, ఇండియన్ పోస్టల్ బ్యాంక్ జనగామ మేనేజర్ రమేష్ హాజరై మాట్లాడారు. తపాలాశాఖలో ప్రజలకు పలురకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో రికరింగ్ డిపాజిట్, సేవింగ్స్ బ్యాంక్, సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ తపాలా జీవితబీమా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో పాటు పోస్టల్ పేమెంట్ బ్యాంకులో రూ.555లకు రూ.10 లక్షల ప్రమాదబీమా, రూ.749లకు రూ.15 లక్షల ప్రమాదబీమా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, జనగామ ఏంవోలు భిక్షపతి, మల్లారెడ్డి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ప్రవళిక, నర్సింహులు, సిద్దేశ్వర్లు, పరుషరామిరెడ్డి, రాజు, తిమ్మయ్య, భార్గవి, ఉషారాణి, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తపాలాశాఖ అధికారులు

ఎల్‌వోసీల అందజేత

జగదేవ్‌పూర్ /సిద్దిపేట టౌన్, ఆగస్టు 13: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని మందాపూర్ గ్రామానికి చెందిన లింగాల యాదగిరి తుంటి ఆపరేషన్ కోసం నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి కొండ సురేఖ ద్వారా ప్రభుత్వం నుండి యాదగిరి చికిత్స నిమిత్తం రూ. రెండున్నర లక్షలు ఎల్‌ఓసీ మంజూరు కాగా మంగళవారం బాధిత కుటుంబసభ్యులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి ఎల్‌ఓసీని అందించారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల గ్రామానికి చెందిన కొత్తపల్లి వరప్రసాద్ కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబసభ్యులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో వరప్రసాద్ కుటుంబసభ్యులకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు.



రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న పూజల హరికృష్ణ

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 13: మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదన వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట అర్బన్, రూరల్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ 2024 జూన్ 27న రాష్ట్ర ముఖ్యమంత్రి హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశమై సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే కొడంగల్‌లో సెమి రెసిడెన్షియల్ పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని, రానున్న కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించారని ఇది సరైనది కాదని అన్నారు. ఈ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాబోయే కాలంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మామిడాల కనకయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెల్లి రాజమణి, కార్మికులు కిష్టవ్వ కిష్టవ్వ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు, సీఐటీయూ నాయకులు

సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో తనిఖీ



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న జోనల్ అధికారి ప్రత్యూష

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 13: హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలను సాంఘిక సంక్షేమశాఖ జోనల్ అధికారి ప్రత్యూష మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యాబోధన, వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలో ప్రతిరోజు 50 పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఇష్టంతో చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఇందులో ప్రిన్సిపాల్ శ్యామలత వైస్ ప్రిన్సిపాల్ సంబయ్య తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



బెజ్జంకి బాలుర పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

బెజ్జంకి, ఆగస్టు 13: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం బెజ్జంకి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మాలతి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులను ఆదుకోవాలి

చేర్యాల, ఆగస్టు 13: కేరళ రాష్ట్రం వయనాడ్‌లో జరిగిన వరద బాధితులను కేంద్రం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. వరద బాధితుల సహాయం కోసం కొమురవెల్లి మండల కేంద్రంలో మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ వరద ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి బాధితులను అండగా నిలిచేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘంనాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, నక్కల యాదవరెడ్డి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయి చెల్లించనందుకు వస్తువులు వేలం

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 13: సిద్దిపేట లోని రైతు బజార్లోని (1) షటర్ షాప్ నెంబర్ 6 అద్దె బకాయలు చెల్లించనందుకు అదనపు కలెక్టర్ అనుమతితో జూన్ 21న షాప్‌లో ఉన్న సీడ్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తదితర వస్తువులను సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో భద్రపరిచామని, వీటిని బహిరంగంగా వేలం వేస్తామని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న ఉదయం 11 గంటలకు సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వేలం వేస్తుందని పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

మర్కుక్, ఆగస్టు 13: మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో మంగళవారం మహాత్మాగాంధీ ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ రేణుక గ్రామంలో సంవత్సరం నుంచి జరిగిన పని వివరాలను, కూలీలకు డబ్బు చెల్లింపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి ఆరిఫా, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ లలిత, అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్న, ఆశావర్కర్లు ధనలక్ష్మి, లత, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

జగదేవ్‌పూర్, ఆగస్టు 13: జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలోని కిరాణా దుకాణంలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన కమ్మరి జగదీష్ కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం దుకాణం వద్దకు వెళ్లి చూసేసరికి షట్టర్ తాళం తీసి ఉండడంతో అనుమానం వచ్చి లోపలి కెళ్లి చూశాడు. దీంతో గల్లపెట్టెలో నగదు, సిగరేట్ డబ్బాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులే దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు.

రేషన్ బియ్యం పట్టివేత

తొగుట/చేర్యాల, ఆగస్టు 13: తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో (టీఎస్ 08 యూటీ 3009) నెంబర్‌గల ట్రాలీ వాహనంలో అనుమతి లేకుండా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్, తొగుట పోలీసుల సంయుక్తాధ్వర్యంలో పట్టుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తొగుట పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా రెండురోజుల క్రితమే రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ప్రచారం జరుగగా.. ఈ విషయం దాచిపెట్టి మంగళవారం రాత్రి మీడియాకు సమాచారం ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తున్నదని స్థానికులు తెలిపారు. అలాగే కొమురవెల్లి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న 16.30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. కొమురవెల్లికి చెందిన కడమంచి మల్లేశం, కడమంచి తిరుపతి తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని తూప్రాన్‌కు చెందిన సందీప్‌కు విక్రయిస్తున్న క్రమంలో వాహనంలో తరలిస్తుండటాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'సీఎం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి'

సిద్దిపేట రూరల్, ఆగస్టు 13: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎంపీటీసీ ఎర్ర ఎల్లం, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోటగిరి ప్రభాకర్, బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు బండి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో వారు మాట్లాడారు. గ్రామంలోని ప్రజలు, నాయకులు బీఆర్ఎస్‌లోనే, మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంటే ఉంటామని స్పష్టం చేశారు. కొంతమంది స్వార్థపరులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం తల్లిలాంటి పార్టీని వదిలి కాంగ్రెస్‌లో చేరడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు కంది సత్తయ్య, అంబటి దేవేందర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తరిగొప్పుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగ విద్యార్థికి మాజీ సర్పంచ్ చేతులమీదుగా వీల్‌చైర్‌ను అందజేస్తున్న ఎంఈవో

మద్దూరు, ఆగస్టు 13: దివ్యాంగ విద్యార్థులు ప్రతి బుధవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గల భవిత సెంటర్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థి గడిపె సాయికుమార్‌కు మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి చేతులమీదుగా వీల్‌చైర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో వరదరాజు, హెచ్‌ఎం చంద్రశేఖర్‌శర్మ, ఫిజియోథెరపీ వైద్యాధికారి శివసాగర్, ఐఈఆర్‌పీలు లక్ష్మణ్, మనిషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు తొందరగా పూర్తి చేయాలి



గ్రామసభలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ అమీనా బేగం

కొండపాక, ఆగస్టు 13: కొండపాకలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు పనులు నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని గ్రామస్థులు కోరారు. కొండపాకలో మంగళవారం పలు సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే గ్రామంలోని పలు ప్రాంతాలకు తాగునీరు సరిగా సరఫరా కావడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



చేర్యాలలో భారీ జాతీయజెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చేర్యాల, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేర్యాల పట్టణంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులచే గాంధీచౌక్ నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వరకు భారీ జాతీయజెండా ప్రదర్శన చేపట్టారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను పరిశుభ్రం చేశారు. జై జవాన్, జైకిసాన్, జై తిరంగా నినాదాలతో పట్టణం దద్దరిల్లింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 13: సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎస్.సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో విద్యుత్ సంభాల వద్ద ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు భారత్‌నగర్, గణేష్‌నగర్, విక్టరి థియేటర్, రైతుబజార్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, కావున ఆయా వార్డు ప్రజలు సహకరించాలని కోరారు.

రమేశ్‌కు శ్రీదేవి సినీ అవార్డు

చేర్యాల, ఆగస్టు 13: చేర్యాల మండలం చుంచనకోట గ్రామానికి చెందిన ఆలేటి రమేశ్ సామాజిక సేవారంగంలో రాణిస్తుండటాన్ని రాష్ట్ర ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ నిర్వాహకులు గుర్తించి శ్రీదేవి సినీ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రతియేటా నిర్వహిస్తున్న మాదిరిగా సినీనటి శ్రీదేవి 61వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఆలేటి రమేశ్‌కు ప్రశంసాపత్రం, మెమొంటో ఇచ్చి శాలువాతో సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయనను స్థానికులు అభినందించారు.

గాజుల విక్రయదారుల సంఘం కార్యవర్గ ఎన్నిక

చేర్యాల, ఆగస్టు 13: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో గాజులు విక్రయించే మహిళలు మంగళవారం విక్రయదాసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కావేటి కనకవ్వ, ఉపాధ్యక్షురాలిగా చేను మౌనిక, ప్రధాన కార్యదర్శిగా కావేటి భాగ్య, కోశాధికారిగా మద్దెబోయిన సంతోష, కార్యదర్శిగా గుంటిపల్లి రాజేశ్వరి, సలహాదారుగా తుపాకుల భాగ్యలక్ష్మి, సభ్యులుగా మణెవ్వ, కళావతి, బాలవ్వ, లలిత, కృష్ణవేణి, ఇంద్ర, జ్యోత్న్న, మాధవి, కవిత ఎన్నికయ్యారు.

శ్రీయోగ లింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 13: సిద్దిపేటలోని శ్రీయోగ లింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, సర్ప నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా సాగింది. మూడురోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, పూజారి చందోది కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.